వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, జులై 25, 2026

# నైపుణ్యంతోనే విపత్తులను ఎదుర్కోవచ్చు

- కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి
- ముగిసిన మహబూబాబాద్ పోలీసుల విపత్తు నిర్వహణ శిక్షణ



**మామునూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మామునూర్ 4వ బెటాలియన్‌లో మహబూబాబాద్ జిల్లాకు చెందిన సివిల్, ఏఆర్ హెడ్ క్వార్టర్ పోలీసుల విపత్తు నిర్వహణ శిక్షణ ఘనంగా ముగిసింది. మహబూబాబాద్ జిల్లా నుండి వచ్చిన 30 మంది పోలీసులు గత 4 వారాల పాటు 4వ బెటాలియన్‌లో 'బేసిక్ ఫస్ట్ రెస్పాన్స్' కోర్సులో కఠిన శిక్షణ పొందారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తినష్టాలను నివారించడంలో పోలీసుల పాత్ర కీలకమని తెలిపారు. 4 వారాల పాటు సాగిన ఈ శిక్షణలో నిష్ణాతులైన సిబ్బంది ద్వారా నాల్గు ప్రధాన విభాగాలపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఎమ్.ఎఫ్.ఆర్ : మెడికల్ ఫస్ట్ రెస్పాండర్ విభాగంలో అత్యవసర వైద్య సేవలందివ్వడంపై అవగాహన. సి.ఎస్.ఎస్.ఆర్ : కాలప్సెడ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ కింద కూలిన భవనాలు, శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించే విధానాలు. రోప్ రెస్క్యూ : కొండలు, వరదలు, ప్రమాదకర ప్రాంతాల్లో తాడుల సహాయంతో రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం. ఎ.డి.ఆర్.సి : ఆక్వాటిక్ డిజాస్టర్ రెస్పాన్స్ కోర్సు కింద నీటిలో మునిగిపోయేవారిని రక్షించడం, వరద సహాయక చర్యలపై మెలకువలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో అంకితభావంతో పాల్గొని ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులకు కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను రక్షించడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అభినందించారు.

ఈ ముగింపు కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా డిఎస్పి శ్రీనివాస్, 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్, ఆర్ఐలు విజయ్, రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, బెటాలియన్ అధికారులు, ఎస్డీఆర్ఎఫ్ ట్రైనింగ్ సిబ్బంది, శిక్షణార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రేపు ఘనంగా 'స్వరవైభవం'

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మధురమైన పాటలతో 'స్వరవైభవం' పేరుతో సంగీత విభావరిని నిర్వహించనున్నట్లు ఐడల్ గంధర్వ ఘంటసాల అసోసియేషన్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు స్వర సామ్రాట్ డా.శరత్ చంద్ర, కార్యదర్శి లక్ష్మణ్ రావు, ఏకశిల కరోకే క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కూజా విజయ్ కుమార్, కార్యదర్శి ప్రగళ్లపాటి రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10:00 గంటలకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరగనుంది. గడచిన రెండు సంవత్సరాలుగా వరంగల్ కళాకారులను ప్రోత్సహిస్తున్న ఐడల్ గంధర్వ ఘంటసాల అసోసియేషన్, ఏకశిల కరోకే క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఎంపిక చేసిన వరంగల్ స్థానిక గాయనీగాయకులు ఘంటసాల, ఎస్పీ బాలు సినిమా పాటలను కరోకే మాధ్యమంలో ఆలపించనున్నారు. ముఖ్య అతిథిగా ఇండియా బ్రాండ్ అంబాసిడర్ రమ్య ప్రగడ, గౌరవ అతిథులుగా ప్రముఖ సంగీత విద్వాంసులు తిరుపతయ్య, ప్రముఖ కవి సిరాజుద్దీన్, సినీ నిర్మాత, నటుడు, టీఎఫ్సీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల గణేష్ హాజరుకానున్నారు. కళలకు నిలయమైన వరంగల్‌లో జరుగనున్న ఈ సంగీత వేడుకను సంగీతాభిమానులందరూ అత్యధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.




# యశోద హాస్పిటల్‌లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు

◆ డాక్టర్ భరత్ ఎ.వాస్వాని

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** క్యాన్సర్ చికిత్సారంగంలో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్ ఆంకాలజీ విభాగం రోగి-కేంద్రిత, సమగ్ర మరియు వ్యక్తిగతీకరించిన వైద్య సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ప్రతి రోగి వ్యాధి స్వభావాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు అత్యాధునిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, హెమటాలజిస్ట్ డా. భరత్ ఎ. వాస్వాని తెలిపారు. వ్యాధి తీవ్రతను, స్వభావాన్ని ముందస్తుగా గుర్తించేందుకు ఆసుపత్రిలో నెక్స్ట్-జెనరేషన్ సీక్వెన్సింగ్, ఫిష్ పరీక్షలు, ఫ్లో సైటోమెట్రీ, ప్రత్యేక మాలిక్యులర్ పరీక్షలు పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఈ అధునాతన పరీక్షల నివేదికల ఆధారంగానే ప్రతి రోగికి అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగత చికిత్స ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. క్లిష్టమైన మరియు సంక్లిష్టమైన క్యాన్సర్ కేసులను సమర్థవంతంగా నిర్వహించేందుకు యశోద ఆసుపత్రిలో ప్రత్యేకంగా 'మల్టీడిసిప్లినరీ ట్యూమర్ బోర్డ్' సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ వేదికపై మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజిస్టులు, పాథాలజిస్టులు, రేడియాలజిస్టులు, ఇతర వైద్య నిపుణులు సమావేశమై చర్చించి, ఆ రోగికి అందించాల్సిన ఉత్తమమైన మరియు సరైన చికిత్సా విధానాన్ని ఖరారు చేస్తారని తెలిపారు. యశోద హాస్పిటల్‌లో కేవలం సాంప్రదాయ కీమోథెరపీ మాత్రమే కాకుండా, రోగుల కోలుకునే వేగాన్ని పెంచే అనేక అధునాతన పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. టార్గెటెడ్ థెరపీ: కేవలం కణితి కణాలను మాత్రమే ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని పనిచేసే చికిత్స. ఇమ్యూనోథెరపీ: శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంపొందించి క్యాన్సర్‌తో పోరాడేలా చేయడం. కార్-టీ సెల్ థెరపీ: క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఈ అత్యాధునిక సెల్యులర్ చికిత్సా సౌకర్యాన్ని కూడా అవసరమైన రోగులకు అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి.



# వర్షాలు సమృద్ధిగా కురవాలి

◆ వరంగల్ వేయి స్తంభాల గుడిలో ఎమ్మెల్యే నాయిని పూజలు

◆ ఘనంగా శత, సహస్రశత కటాభిషేక మహోత్సవం



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షస్తూ... వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల శ్రీ రుద్రేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శత, సహస్రశత కటాభిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులకు ఆలయ అధికారులు మరియు ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలుత శ్రీ గణపతి మహారాజును దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే... అనంతరం శ్రీ రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించారు. ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ నేతృత్వంలో జరిగిన శత, సహస్రశత కటాభిషేక పూజా కార్యక్రమంలో ఆయన కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... "రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు జలకళను సంతరించుకోవాలి. రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండి, పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలి. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని రుద్రేశ్వర స్వామివారిని ప్రార్థించాను." అని తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ మున్సిపల్ ఎన్నికల సమరశంఖం..

• బూత్ స్థాయి విజయమే లక్ష్యం

• సునీల్ బన్సాల్ దిశానిర్దేశం



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సాల్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి, ప్రతి బూత్ స్థాయికి చేర్చాలని సునీల్ బన్సాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేస్తామని, మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసేలా శ్రేణులంతా కష్టపడి పనిచేస్తామని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ సమిష్టి కృషితో మున్సిపల్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలని నేతలు నిశ్చయించుకున్నారు.